క్లుప్తంగా

ఎన్‌క్యూఏఎస్ బృందం పరిశీలన



మాట్లాడుతున్న ఎన్‌క్యూఏఎస్ బృంద సభ్యులు

గోనెగండ్ల: గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎన్‌క్యూఏఎస్ బృంద సభ్యులు డాక్టర్ గాయత్రి కైత్, డాక్టర్ శాంతను సేన్ సూచించారు. మండలంలోని బి.అగ్రహారం గ్రామంలో హెల్త్ క్లినిక్ సెంటర్‌ను శుక్రవారం ఎన్‌క్యూఏఎస్ (నేషనల్ క్వాలిటీ అసూరెన్స్ స్టాండర్డ్స్) బృందం సభ్యులు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. హెల్త్ సెంటర్‌లో అందిస్తున్న సేవలు, పరిస్థితులపై సిబ్బందిని ఆరా తీశారు. వారు మాట్లాడుతూ ఆస్పత్రులలో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకు పరిశీలన చేస్తున్నట్లు చెప్పారు. తమ పరిశీలన నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు. డాక్టర్లు రవళి, రుక్సానా, ఎంపీహెచ్‌ఈఓ హనుమంతు, పరమేష్, శాంతమ్మ, వైద్య సిబ్బంది ఉన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టు వద్ద విస్తృత తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏఈఎస్ వినోద్‌కుమార్

హొళగుంద: ఆంధ్రా–కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి చెక్‌పోస్టును శుక్రవారం అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ (ఏఈఎస్) వినోద్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్‌ఐ రామ్మూర్తి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక నుంచి ఆంధ్రాకు మద్యం, డబ్బు ఇతర నిషేధిత వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు వాహన తనిఖీలు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. తనిఖీల సమాచారం ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలన్నారు.

ఆటపాటలతో హాస్యం



ఆటపాటలతో అలరిస్తున్న యువకులు, చిన్నారులు

హొళగుంద: హొళగుంద మండల కేంద్రంలో విరక్త మఠం (ఉరువకొండ మఠం) పరిసర ప్రాంతానికి చెందిన యువకులు నిర్వహిస్తున్న కామన్న వేడుకల్లో భాగంగా శుక్రవారం ప్రదర్శించిన పలు హాస్య సన్నివేశాలు అకట్టుకున్నాయి. చిన్నారులు, యువకులు ఆడవేషాలు, అలంకరణలతో బృందంగా ఏర్పడి హాస్యపాటలు పాడుతూ వీధి వీధి తిరిగారు. కొద్ది రోజులుగా జరుగుతున్న హాస్య కార్యక్రమాలు ప్రజలను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. కామన్న పండుగ ఆఖరి రోజు ప్రదర్శించే వేషాలు ప్రజలను మరింత కడుపుబ్బ నవ్వించనున్నాయి.

సింహ వాహనంపై శ్రీరంగనాథుడు



మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథుని వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో స్వామి వారికి అర్చకులు రంగస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో ఆలయ ప్రదక్షిణ చేశారు. రాత్రి స్వామి వారు సతీసమేతంగా సింహ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి వారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సృష్టికి తానే సర్వం సహ చక్రవర్తి అని అందరికీ తెలిపేందుకు సింహ వాహనంపై విహరిస్తూ స్వామివారు భక్తులకు దర్శనమిస్తారని అర్చకులు రంగస్వామి తెలిపారు. ఆలయ చైర్మన్ దస్తగిరి గౌడ్, ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు

మద్దికెర: మండలంలో నాటుసారా విక్రయించినా, తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. సారా విక్రయదారులను ఇప్పటికే అరెస్టు చేసి కేసులు నమోదు చేసి రిమాండుకు పంపడం జరిగిందన్నారు. ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేయరాదని సూచించారు.

బెల్లం ఊట ధ్వంసం

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా కొండల్లో శుక్రవారం ఎస్‌ఐ పెద్దయ్యానాయుడు ఆధ్వర్యంలో పోలీసులు నాటుసారా స్థావరాలపై దాడులు చేపట్టారు. కొండల్లో ఉన్న నాటుసారా స్థావరాలను గుర్తించి అక్కడ సారా తయారీకి బిందెల్లో నిల్వ ఉంచిన 700 లీటర్ల బెల్లం ఊట, సారాతో పాటు బిందెలను ధ్వంసం చేశారు.

జగనన్నతోనే ప్రజా సంక్షేమం

- ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



మిట్టసోమాపురంలో ఎమ్మిగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ఎమ్మిగనూరుటౌన్: ముస్లిం మైనారిటీల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సున్నం బట్టి తదితర మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం బయటికి వచ్చిన ముస్లింలను వారు కలిసి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. బీజేపీతో జత కట్టిన టీడీపీని నమ్మవద్దని సూచించారు. అన్ని విధాలుగా వెనుకబడ్డ ముస్లింలు అభ్యున్నతి సాధించాలన్న తలంపుతో నాడు దివంగత నేత వైఎస్సార్ నాలుగు శాతం రిజర్వేషన్లను కల్పించారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ రిజర్వేషన్లను కొనసాగిస్తూ విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో చేయూతనందించడమే గాకుండా షాదీతోఫా పేరుతో లక్ష రూపాయాల ఆర్థిక సహాయం అందిస్తున్నారని తెలిపారు. మసీదుల అభివృద్ధికి నిధుల కేటాయింపుతో పాటు మౌజన్లకు వేతనాలు ఇస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. మే 13వ తేదీన జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా ప్రతుల్, రియాజ్‌అహమ్మద్, షబ్బీర్‌అహమ్మద్, వాహిద్, ఇషాక్, షాబుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పట్టణంలోని 18వ వార్డులోని గంజిళ్ల రోడ్డులో ఏనుగుబాల సత్యనారాయణ రెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక ప్రారంభించి పాదచారులకు మంచినీరు అందించారు. వేసవిలో పాదాచారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు.

నందవరం: పేద బడుగు బలహీన వర్గాలకు ప్రస్తుతం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాచాపురం, మిట్టసోమాపురంలోని పలు వివాహ వేడుకలకు ఆమె హాజరై వధూవరులను ఆశీర్వదించారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారంపై దృష్టి



ములుగుందంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి

ఆస్పరి: ఆలూరు నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, త్వరలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరుపాక్షి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని ములుగుందం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకుడు గార్లపెంట ఉసేని కుమారుడు దస్తగిరి, మౌనిక వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆస్పరి మండలంలో తాగునీటి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లానన్నారు. స్పందించిన సీఎం మండలంలోని ఐనకల్లు, తొగలుగల్లు, పుప్పాలదొడ్డి, డీకోటకొండ, గార్లపెంట, తురువగల్లు, దొడగొండ, చిన్నహోతూరు, జోహరాపురం గ్రామాలకు వేసవిముగిసే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో 9 గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారని చెప్పారు. నీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు జోహరాపురం సమీపంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఎన్నికలు ముగిసి ముఖ్యమంత్రి అయిన వెంటనే నీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సంక్షేమం అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, పార్టీ నాయకులు కట్టెల గోవర్ధన, పెద్దయ్య, దత్తాత్రేయరెడ్డి, కేశవరెడ్డి, చిన్నాయప్ప, ప్రకాష్, బాలన్న, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

చిప్పగిరి: ప్రజా సంక్షేమ పాలనను మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థి బుసినె విరూపాక్షి ప్రజలను విన్నవించారు. శుక్రవారం మండలంలోని దౌల్తాపురం, నంచర్ల, రామదుర్గం తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఓటమి భయంతోనే ప్రతిపక్షనేత చంద్రబాబు పొత్తులకు తెరలేపారని ఆరోపించారు. పార్టీలన్నీ ఏకమై వచ్చినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయాన్ని ఆపలేరన్నారు. నాయకులు జూటూరు మారయ్య, నరసింహులు, భీమ, హనుమంతు, చల్లా రామంజి, వంచేటి శివ తదితరులు పాలొన్నారు.

భవిష్యత్తును మార్చే ఆయుధం ఓటు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్‌ఓ, కమిషనర్ తదితరులు



మాట్లాడుతున్న ఆర్డీఓ నీలపు రామలక్ష్మి

ఎమ్మిగనూరుటౌన్: ఓటు హక్కు భవిష్యత్తును మార్చే ఆయుధం లాంటిదని నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ చిరంజీవి పేర్కొన్నారు. నీ ఓటు –నీ భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి కమిషనర్ గంగిరెడ్డి, తహసీల్దార్ శేషారెడ్డి, సచివాలయ సిబ్బందితో కలిసి ర్యాలీ చేపట్టారు. అనంతరం సోమప్ప సర్కిల్ వద్ద ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి వేసే ఓటు భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు ను వినియోగించుకోవాలని కోరారు. మున్సిపల్ డీఈలు మనోహర్‌రెడ్డి, నీరజ, ఏఈ మదన్, మున్సి పల్ మేనేజర్ వరప్రసాద్, మెప్మా సీఎంఎం జయవర్ధన్, మెప్మా సీఓలు, ఆర్‌పీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఎమ్మిగనూరురూరల్: అన్ని పార్టీల నాయకులు తప్పనిసరిగా ఎన్నికల నియామవళిని పాటించాలని ఆర్‌ఓ చిరంజీవి సూచించారు. ఆయన శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాజకీయ పార్టీల నాయకులు ప్రచారానికి వినియోగించే వాహనాలకు అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతులు లేని వాహనాలను వినియోగిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తూచ తప్పక పాటించాలన్నారు. ఉద్యోగులు, వాలంటీర్లు, ఇతర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసేవారు ప్రచారంలో పాల్గొంటే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. ప్రతిఒక్కరూ నిబంధనల మేరకు నడుచుకుంటూ అధికారులకు సహకరించాలని కోరారు. తహసీల్దార్లు శేషారెడ్డి, భూపతిపార్వతి, ఓటులేసు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎంపీడీఓ కొండన్న, ఎన్నికల డీటీ రఘువీరా, టౌన్ సీఐ మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) చిరంజీవి, తహసీల్దార్ శేషారెడ్డి పరిశీలించారు. ఆర్‌ఓ చిరంజీవి మాట్లాడుతూ గ్రామంలో 177 పోలింగ్ కేంద్రం నుంచి 185 పోలింగ్ కేంద్రం వరకు పరిశీలించామని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఐ లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

పత్తికొండ రూరల్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రజల చేతుల్లో ఉన్న వజ్రాయుధమని రెవెన్యూ డివిజనల్ అధికారిణి నీలపు రామలక్ష్మి అన్నారు. స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పత్తికొండలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ భవనంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మధుబాబు అధ్యక్షతన పొదుపు గ్రూపు సంఘాల లీడర్లు, సభ్యులకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ నీలపు రామలక్ష్మి మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించేలా పొదుపు సంఘాల మహిళలు ఓటర్లను చైతన్యవంతం చేయాలన్నారు. గతంలో కంటే ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలన్నారు. పోలింగ్ విధానాన్ని తెలియజేశారు. ఎన్నికల నియమావళిని గురించి వివరించారు. తహసీల్దారు మాధవరావు, ఎంపీడీఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అవి - ఇవి

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యం

తుగ్గలి: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడమే తమ లక్ష్యమని, ప్రజలందరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా భరోసా కల్పించాలని పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సర్కిల్ నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తుగ్గలి, జొన్నగిరి, మద్దికెర పోలీస్‌స్టేషన్లకు సంబంధించి కేసులను సమీక్షించారు. సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఎస్పీ చేసిన దిశానిర్దేశాలను వివరించారు. ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మద్యం, నగదు, ఇతర వస్తువుల అక్రమ రవాణా కట్టడికి వాహన తనిఖీలు చేయాలన్నారు. ఆయా పోలీస్ స్టేషన్ల ఎస్‌ఐలు మల్లికార్జున, రామాంజనేయులు, రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

నందవరం: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పూలచింత, పెద్దకొత్తిలి గ్రామాలలోని సచివాలయాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించి బ్యానర్లు, పోస్టర్లను పూర్తిగా తొలగించాలన్నారు. కోడ్‌ను ఉల్లఘింస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జూనియర్ అసిస్టెంట్ ఈరన్న, పంచాయతీ కార్యదర్శులు పెద్దిరెడ్డి, జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తుగ్గలి: మండల పరిధిలోని బాటతండ, ఉప్పర్లపల్లి, బొల్లవానిపల్లి పోలింగ్ స్టేషన్లను శుక్రవారం తహసీల్దార్ షర్మిల పరిశీలించారు. పోలింగ్ స్టేషన్లలో విద్యుత్, తాగునీరు, టాయిలెట్లు, ర్యాంపులు వంటి వసతులపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తహసీల్దార్ వెంట ఆర్‌ఐ సుధాకరరెడ్డి, వీఆర్వోలు గోవిందప్ప, రంగన్న ఉన్నారు.

పోలీసు బలగాల కవాతు

గోనెగండ్ల: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని డీఎస్పీ సీతారామ య్య తెలిపారు. డీఎస్పీ ఆధ్వర్యంలో శుక్రవా రం మండలంలోని హెచ్.కైరవాడి, కున్నూరు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా ధైర్యం నింపేందుకు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే పది గ్రామాల్లో కవాతు నిర్వహించినట్లు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసు శాఖ కృషి చేస్తోందన్నారు. ఎస్ఎస్‌బీ అసిస్టెంట్ కమాండెంట్ రాకేష్ కుమార్, సీఐ రామకృష్ణయ్య, కేంద్ర మిలటరీ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచేలా చర్యలు

ఆలూరు రూరల్: నియోజకవర్గంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఆలూరు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ రామునాయక్ ఆధ్వర్యంలో అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా యువతకు అవగాహన కల్పించాలన్నారు. కళాశాల, పాఠశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ర్యాలీలు నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలో 2,56,528 మంది ఓటర్లు ఉండగా.. అందులో 1,28,825 మంది పురుషులు, 1,27,651 మంది స్త్రీలు, 52 మంది ఇతరులు ఉన్నారు. గత ఎన్నికల్లో 79.71 శాతం పోలింగ్ నమోదవగా ఈ సారి 85 శాతానికి పెంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఆర్వో చంద్రశేఖర్, ఎంపీడీఓ నరేంద్రకుమార్, డీటీ రజనీకాంత్ రెడ్డి, ఈడీటీ గుండాల్ నాయక్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

మహిళకు ఐదేళ్ల జైలుశిక్ష

పత్తికొండ రూరల్: పత్తికొండలోని సాయిబాబా ఆలయం ఆవరణలో 12 ఏళ్ల క్రితం దేవుడి ప్రసాదంలో మత్తుమందు కలిపి ఓ భక్తురాలి ఆభరణాలు చోరీ చేసేందుకు ప్రయత్నించిన కేసులో నిందితురాలికి ఆదోని సబ్‌కోర్టు జడ్జి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని అర్బన్ సీఐ మురళీమోహన్ శుక్రవారం తెలిపారు. కేసు వివరాలు.. 2012 అక్టోబర్ 8న పత్తికొండ సాయిబాబా ఆలయ వీధికి చెందిన ఉన్న జయలక్ష్మి స్వామి దర్శనానికి వెళ్లింది. ఆలయం వద్ద ఉన్న హరిజన లక్ష్మీదేవి దేవుడి ప్రసాదం అని చెప్పి జయలక్ష్మికి మత్తుమందు కలిపిన ప్రసాదం ఇచ్చింది. ప్రసాదం తిన్న జయలక్ష్మి కళ్లు తిరిగి పడిపోగా ఆమె చెవికమ్మలు, ముక్కుపుడకలు అపహరించేందుకు యత్నించింది. తేరుకున్న బాధితురాలు కేకలు వేయడంతో అక్కడున్న వారు లక్ష్మీదేవిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ కేసు శుక్రవారం తుది విచారణ పూర్తికాగా నేరం రుజువు కావడంతో నిందితురాలికి ఐదేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు. నేరస్తురాలిని కడప సెంట్రల్ జైలుకు తరలించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కిష్టప్ప (38) నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలులోని ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు బుసినె చంద్రశేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, ఎంపీటీసీ శంకరప్ప తదితరులు గ్రామానికి చేరుకుని కిష్టప్ప మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి చంద్రశేఖర్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఈతకు వెళ్లి మృత్యు ఒడికి..

గోనెగండ్ల: వివాహ వేడుకకు వచ్చిన బాలుకు సరదాగా ఈతకు వెళ్లి మృత్యువాత పడిన సంఘటన గోనెగండ్లలోని లక్ష్మీపేటలో చోటుచేసుకుంది. వివరాలు.. ఎమ్మిగనూరు మండలం మల్కాపురానికి చెందిన ఎల్లారెడ్డి, జ్యోతి దంపతులు ఇద్దరు కుమారులతో లక్ష్మీపేటలో గొల్ల నాగరాజు ఇంట్లో శుక్రవారం జరిగే వివాహ వేడుకకు హాజరయ్యారు. చిన్న కుమారుడు అరుణ్‌కుమార్ (6) గ్రామంలో ఒకటో తరగతి చదువుతున్నాడు. అందరూ పెళ్లి సందడిలో ఉండగా అరుణ్‌కుమార్ స్థానిక పిల్లలతో కలిసి సమీపంలోనిఎల్లెల్సీ కాలువకు ఈతకు వెళ్లాడు. కాలువలో మెట్ల వద్ద ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన పిల్లలు కేకలు వేయడంతో అక్కడున్న వా రు వచ్చి అరుణ్‌కుమార్‌ను బయటకు తీశా రు. బాలుడిని గోనెగండ్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అరుణ్‌కుమార్ మృతదేహాన్ని స్వగ్రామం మల్కాపురానికి తీసుకెళ్లారు. పెళ్లికి వచ్చి బాలుడు మృతి చెందడంతో ఆ ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

కర్నూలు: ఆటో డ్రైవర్ బోయ రంగనాయకులు (40) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోనెగండ్ల మండలం అగ్రహారం గ్రామానికి చెందిన రంగనాయకులు, సుగుణ దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి పదేళ్ల క్రితం కర్నూలుకు వలస వచ్చి నిర్మల్ నగర్‌లో నివాసముంటున్నారు. రంగనాయకులు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించేవాడు. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఈక్రమంలో తన తండ్రి వద్ద డబ్బు తీసుకువస్తానని భార్య సుగుణ గురువారం పుట్టింటికి వెళ్లింది. రాత్రి 8 గంటల సమయంలో రంగనాయకులు ఇంట్లో ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఇదే విషయాన్ని భార్య సుగుణకు సమాచారం అందించడంతో ఆమె ఆసుపత్రికి చేరుకుంది. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని మార్చురీ కేంద్రానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నాల్గవ పట్టణ పోలీసులు తెలిపారు.



రంగనాయకులు మృతదేహం

కోలుకోలేక వ్యక్తి మృతి

నందవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కురవ భీరప్ప(28) కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపిన వివరాలు.. నందవరం గ్రామానికి చెందిన కురవ బీరప్ప ఈ నెల 17న భార్య పుట్టినిల్లు బోడబండకు వెళ్లాడు. బైక్‌పై తిరిగివస్తుండగా ముగతి గ్రామంలోని ప్లేగమ్మ ఆలయ సమీపంలో కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గయపడిన బీరప్పను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి తల్లి కురవ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపటినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె- నందవరం ప్రధాన రహదరిలో కనకవీడు క్రాస్ రోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగలి ప్రకాష్ (24) మృత్యువాత పడ్డాడు. మరో వ్యక్తి బోయ గణేశ్‌కు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. ఎమ్మిగనూరుకు చెందిన స్నేహితులు ప్రకాష్, గణేశ్ పని నిమిత్తం నాగలదిన్నెకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నాగలదిన్నె- నందవరం ప్రధాన రహదారిలో కనకవీడు క్రాస్ రోడ్డు సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడ్డారు. తలకు తీవ్ర రక్త గాయం కావడంతో ప్రకాష్ అక్కడిక్కడే మృతి చెందాడు. గణేశ్ తల, ముఖానికి గాయం కావడంతో అక్కడున్న వారు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గణేశ్ ఆసుపత్రిలో చిక్సిత పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మృతి చెందిన మంగలి ప్రకాష్ (ఫైల్)

నీరే జీవకోటికి ప్రాణాధారం

పత్తికొండ రూరల్: సకల జీవకోటికి నీరు ప్రాణాధారమని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మధుబాబు అన్నారు. శుక్రవారం ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి పొదుపు గ్రూపు సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏపీఎం మధుబాబు మాట్లాడుతూ నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. వైకేపీ క్లస్టర్ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

కృష్ణగిరి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు లక్కసాగరం రాముడు, బాల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో శుక్రవారం వారు సిద్ధం స్టిక్కర్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. ఐదేళ్లలో సీఎం జగనన్న పాలనలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారన్నారు. పత్తికొండ గడ్డపై మరోమారు కంగాటి శ్రీదేవిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులు మధుసూదన్‌గౌడ్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

కృష్ణగిరి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ ల్యూక్ తెలిపారు. మండల పరిధిలోని అమకతాడు, కంబాలపాడు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం పోషన్ పక్వాడ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తల్లీబిడ్డ సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. సూపర్‌వైజర్లు శ్రీదేవి, సరస్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న మరోసారి సీఎం కావాలని..



శబరిమలకు బైక్ యాత్ర చేపట్టిన యువకులు

కృష్ణగిరి: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాలని, అలాగే కంగాటి శ్రీదేవి మరోమారు పత్తికొండ ఎమ్మెల్యేగా గెలుపొందాలని కోరుతూ మండల పరిధిలోని ఆలంకొండ, పులిచెర్ల గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఆశోక్‌కుమార్, సురేష్ శుక్రవారం శబరిమలకు బైక్ యాత్ర చేపట్టారు. అయ్యప్ప స్వామిని దర్శించుకుని తమ అభిమాన నాయకులు ఎన్నికల్లో అఖండ విజయం సాధించాలని కోరుకుంటామని వారు తెలిపారు. గత ఐదేళ్లలోనే ఇతర రాష్ట్రాలు ఏపీ వైపు చూసేలా సీఎం జగనన్న ఆదర్శపాలన అందించారని, మరోమారు అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసి చూపుతారన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి



ఆలూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌ఓ డి.రామునాయక్

ఆలూరు: నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బంది కలగకుండా కనీస వసతులు కల్పించాలని ఆర్‌ఓ డి.రామునాయక్ ఆదేశించారు. ఆలూరులోని మెయిన్ పాఠశాల, ప్రభుత్వ బాలుర హైస్కూల్, ఆదిఆంధ్ర పాఠశాల పోలింగ్ కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఓటింగ్ తేదీ నాటికి ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, విద్యుత్ సదుపాయం, తలుపులు, కిటికీలు తదితర సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి పోలింగ్‌బూత్ వద్ద బీఎల్‌ఓ పేరు ఉండాలని సూచించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, డీటీ రజనీకాంత్ రెడ్డి, ఎలక్షన్ డీటీ గుండాలనాయక్, సీనియర్ అసిస్టెంట్ బసవన్నగౌడు, ఈఓ నాయుడు తదితరులు ఉన్నారు.

పాముకాటుతో బాలుడికి అస్వస్థత

గోనెగండ్ల: మండల పరిధిలోని చిన్నమరివీడు గ్రామానికి చెందిన ఆర్యన్ (6) అనే బాలుడు శుక్రవారం సాయంత్రం పాము కాటుకు గురయ్యాడు. వివరాలు.. గ్రామానికి చెందిన లింగన్న కుమారుడు ఆర్యన్ సాయంత్రం ముఖం కడుక్కునేందుకు బాత్‌రూమ్‌కు వెళ్లాడు. ముఖం కడుక్కుంటుండంగా పాము కాటు వేసింది. గమనించిన ఆర్యన్ కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

రెండు గడ్డివాముల దగ్ధం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలో శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గొల్ల చిన్న వెంకట్రాముడు అనే వ్యక్తికి చెందిన 2 గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామ సమీపంలోని చెరువులో ముళ్ల పొదలకు నిప్పంటుకొని నిప్పరవ్వలు చెరువు పక్కన ఉన్న గడ్డివాములపై పడటంతో మంటలు చెలరేగాయి. గ్రామస్తులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అలాగే నీటిని చల్లి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. ఒక గడ్డివాము పూర్తిగా కాలిపోగా, వేరుశనగ పొట్టు వాము సగం కాలిపోయింది. దాదాపు రూ.30 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయారు.